



# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)






Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 253 | ఆదివారం 14- సెప్టెంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695



## ఇదే సరైన అవకాశం..

## ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దు

•కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం బలమైన వాదనలు సిద్ధం చేయండి • 904 టీఎంసీలు మన హక్కు - ఒక్క చుక్క నీరును కూడా వదులుకోం • 23 నుంచి ఢిల్లీలో కృష్ణా జలాల ట్రిబ్యునల్ విచారణ - తెలంగాణ తరపున తుది వాదనలు • ఏపీ అక్రమ నీటి మళ్లింపుపై ఆధారాలు సమర్పించండి-అధికారులకు సీఎం సూచనలు • గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తెలంగాణకు అన్యాయం • సాగునీటి, తాగునీటి అవసరాలకు కృష్ణా జలాలు తప్పనిసరి - కృష్ణా వివాదంపై రేవంత్ స్పష్టం

**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించి తీరాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయ నిపుణులను, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణా నదిలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణాకు చెందాల్సిన నీటివాటాలో ఒక చుక్క నీరు కుడా వదులుకునేది లేదని స్పష్టం చేశారు.

## కవిత మాటలపై కేటీఆర్

## సమాధానం చెప్పాలి: టీపీసీసీ చీఫ్



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** కేటీఆర్ స్థాయిని మించి మాట్లాడుతున్నారు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. రాహుల్‌పై మాట్లాడే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ విషయంలో కవిత మాటలపై కేటీఆర్ సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కాళేశ్వరం అంశంపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ..'తెలంగాణలో పార్టీ ఫిరాయింపులపై రాహుల్ గాంధీ స్పందించాలి అని కేటీఆర్ మాట్లాడుతున్నారు. రాహుల్‌పై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు ఉందా?. ఎమ్మెల్యేల గురించి రాహుల్ ఎందుకు మాట్లాడాలి?

## కొడంగల్‌కు తరలించిన బీడీఎస్ కాలేజీని మళ్లీ తెచ్చుకుంటాం..

### హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** సమాజ భవిష్యత్ ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా అంతే ముఖ్యమని తెలిపారు. నేపాల్, బంగ్లాదేశ్‌లో వచ్చిన విప్లవాలు మన దేశంలో రావద్దంటే సామాజిక నైతిక బాధ్యతలు నేర్పించాలని సూచించారు.

## ఊరుకునేదే లేదు.. సీఎం రేవంత్ రెడ్డికి

### నాగం జనార్దన్ రెడ్డి వార్నింగ్


**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి గండి కొట్టి నల్లగొండ జిల్లాకు నీటిని తరలించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగం జనార్దన్ రెడ్డి హెచ్చరించారు.



## లవర్ మోజులో పడి

## కన్న కూతురుని కడతేర్చిన తల్లి

•లవర్ మోజులో రెండేళ్ల పాపను హత్య చేసిన మమత.. పోలీసుల చెరలో కసాయితల్లి •నర్సరావుపేటలో చిన్నారిని గొంతునులిమి చంపి, స్వగ్రామంలో పూడ్చిపెట్టిన క్రూరతల్లి • కఠినంగా శిక్షించాలి - పాపను హత్య చేసిన మమతపై తల్లిదండ్రుల ఆగ్రహం



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ప్రియుడి మోజులో పడి కట్టుకున్న వాడిని, కన్న పిల్లలను కూడా కాదనుకుంటున్నారు కొంత మంది మహిళలు. ఇలాంటి ఘటనలు ఈ మధ్య సంచలనం కలిగిస్తున్నాయి. అంతే కాదు.. ప్రియుడి కోసం కట్టుకున్న వాడినో లేదా కన్న పిల్లలనో చంపేస్తున్నారు. చివరికి పోలీసు కేసులతో కటకటాలపాలవుతున్నారు. తాజాగా మెదక్ జిల్లాలో లవర్ మోజులో పడి కూతురును కడతేర్చింది ఓ కసాయి తల్లి. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం శభాష్ పల్లికి చెందిన బంటు మమత.. తన రెండేళ్ల కూతురిని తీసుకొని ప్రియుడితో కలిసి ఏపీకి పారిపోయింది.

## సోషల్ మీడియా సైకోలను కట్టడి చేయండి..

## ఎస్పీలకు చంద్రబాబు దిశానిర్దేశం



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** సీఎం చంద్రబాబు 26 జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వారికి దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియా సైకోలను కట్టిడి చేయాలని ఆదేశించారు. రాజకీయ ముసుగులో చేసే నేరాలను ఉపేక్షించవద్దని సూచించారు. వివేక హత్య, సింగయ్య మృతి కేస్ స్టడీలుగా చూడాలని తెలిపారు. ఇన్వెస్టిగేషన్ లో టెక్నాలజీ వినియోగంతో మంచి ఫలితాలు వస్తాయని అన్నారు.రియాక్ట్, రీచ్, రెస్పాండ్, రిజల్ట్ విధానం పాటించాలని తెలిపారు. ప్రజలతో స్నేహంగా ఉంటూనే అసాంఘీక శక్తులు భయపడేలా పనిచేయాలన్నారు. ఈ సమావేశం తరవాత మంత్రులు, సెక్రటరీలతో సమావేశం అయ్యారు. 15, 16 తేదీల్లో జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్ గురించి చర్చించారు. మంత్రులు మరింత సమర్ధవంతంగా పనిచేయాలని సూచించారు. సమస్యలను సవాళ్లను దాటి అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అంతే కాకుండా పాలనలో వేగం పెంచాలని ఉన్నతాధికారులు, మంత్రులకు సూచించారు.

## నువ్వు మగాడివైతే

## వెంటనే రాజీనామా చేయ్..

### కడియం శ్రీహరికి సవాల్



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన ఎమ్మెల్యే పదవికి కడియం శ్రీహరి రాజీనామా చేసేందుకు తగిన సమయం ఆసన్నమని తాటికొండ పేర్కొన్నారు. తాటికొండ రాజయ్య వ్యాఖ్యల ప్రకారం, "కడియం శ్రీహరి వద్ద సిగ్గు, చీము, నెత్తురు లేదు. బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలి. వరంగల్ పౌరుషం ఉంటే, నువ్వు మగాడివైతే వెంటనే రాజీనామా చేసి రా," అని ఆయన అన్నారు.

## జనజీవన స్రవంతిలోకి

## మావోయిస్టు సుజాతక్క..

### 43 ఏళ్ల అజ్ఞాత జీవితానికి ముగింపు..



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** గద్వాల ప్రాంతానికి చెందిన మావోయిస్టు సుజాతక్క 43 ఏళ్ల అజ్ఞాత జీవితానికి ముగింపు పలికారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క తెలంగాణ పోలీసుల ఎదుట శనివారం లొంగిపోయారు. ప్రస్తుతం ఆమె మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న ఏకైక మహిళా నాయకురాలు. పశ్చిమబెంగాల్‌లో 2011 జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య ఆమె. సుజాతక్కపై రూ.కోటి రివార్డు ఉంది.





## ఎవరి అభివృద్ధి కోసం

# పార్టీ మారినవ్?

• రైలు కింద చస్తానన్నవాడివి, కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్లావ్? - గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్ • రైతుబంధు, పెన్షన్, కల్యాణలక్ష్మీ.. మాటలు నిజమయ్యాయా? •గ్యారంటీలతో మోసం చేశారు • పార్టీ మార్చిన ఎమ్మెల్యేలకు రాజీనామా తప్పదు •గద్వాల ఉపఎన్నిక ఖాయం.. 50 వేల మెజారిటీతో బీఆర్ఎస్ విజయం ధ్రువం: కేటీఆర్ ధీమా •గద్వాలలో బీఆర్ఎస్ బహిరంగ సభలో కేటీఆర్

**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఎవరి అభివృద్ధి కోసం పార్టీ మారావని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమా? లేదా నీ సొంత అభివృద్ధి కోసమా అని ప్రశ్నించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీఫాంతో పోటీచేసి గెలిచాక పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా.. అధికార పార్టీకి పెద్ద ఎత్తున పలువురు నాయకులు గుడ్‌బై చెప్పి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా గద్వాలలో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. నేను కాంగ్రెస్‌లో ఎందుకు చేరతానని కృష్ణమోహన్ రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో గద్వాల ప్రచారానికి వచ్చినప్పుడు, వైఎస్ఆర్ చౌరస్తాలో మీటింగ్ పెట్టానని తెలిపారు. ఆ సమయంలో కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అవసరమైతే రైలు కింద తలపెట్టి చచ్చిపోతా కానీ కాంగ్రెస్‌లో చేరనని అన్నాడని గుర్తుచేశారు. మరి ఇవాళ ఎవరి అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లోకి వెళ్లావని కృష్ణమోహన్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమా? నీ సొంత అభివృద్ధి కోసమా? ఎందుకు పార్టీ మారవని నిలదీశారు.

## నేనే సీనియర్..

### జూబ్లీహిల్స్‌లో పోటీ చేస్తా

: అంజన్ కుమార్ యాదవ్ ప్రకటన



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేస్తా. నా సామాజికవర్గానికి న్యాయం చేయాలి. మాకు మంత్రి పదవి ఇవ్వాలి.

## రెండేళ్ల తర్వాత అయిన ప్రధాని మంచి నిర్ణయం తీసుకున్నారు

: ఎంపీ ప్రియాంక గాంధీ



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆ రోజు మణిపూర్ లో పర్యటించనున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆ రాష్ట్రంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. అయితే మణిపూర్ అలర్లు చెలరేగిన సమయంలో ప్రతిపక్షాలు అనేక సార్లు.. అక్కడ ప్రధాని మోడీ పర్యటించాలని డిమాండ్ చేశారు. కానీ అల్లర్లు జరిగిన 2 సంవత్సరాల తర్వాత ప్రధాని మోడీ మణిపూర్ పర్యటనకు వెళ్లేందుకు షెడ్యూల్ వచ్చింది.

## కొడంగల్‌కు తరలించిన బీడీఎస్ కాలేజీని మళ్లీ తెచ్చుకుంటాం..

సిద్దిపేట వైశ్య భవనంలో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పూజోత్సవంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.యువత డ్రగ్స్, గంజాయికి బానిసలుగా మారుతున్నారని హరీశ్‌రావు అన్నారు. విద్య అనేది ఉద్యోగం కోసమే కాకుండా గొప్ప సమాజ నిర్మాణం కోసం అవసరమని అభిప్రాయపడ్డారు. విద్యార్థులను ర్యాంక్ ల కోసమే కాకుండా ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు శారీరకంగా ఎదిగేందుకు క్రీడల ద్వారా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. క్రీడలు గెలుపు, ఓటమిలను తట్టుకునేందుకు కృషి చేస్తుందని తెలిపారు. డ్రగ్స్, ఆన్ లైన్ గేమ్స్ పై విద్యార్థులు దృష్టి పెట్టకుండా చూడాలన్నారు.

విద్యారంగంలో సిద్దిపేట జిల్లా మొదట స్థానంలో ఉందని హరీశ్‌రావు తెలిపారు. చిన్ననాటి జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. రేపటి భవిష్యత్ తరగతి గదులలోనే నిర్మితమవుతుందని.. అది ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యమని అన్నారు. సిద్దిపేటను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చామని తెలిపారు. సిద్దిపేటకు తెచ్చిన బీడీఎస్ కాలేజీని రేవంత్ రెడ్డి కొడంగల్‌కు తరలించాడని మండిపడ్డారు. మళ్ళీ మా ప్రభుత్వం వస్తుంది దానిని మేము మళ్ళీ తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గురుపూజోత్సవం రోజున ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేట్ ఉపాధ్యాయులను సన్మానం చేయాలన్నారు.

## కవిత మాటలపై కేటీఆర్ సమాధానం చెప్పాలి : టీపీసీసీ చీఫ్

ఓట్ చోరీ గురించి రాహుల్ ఆధారాలతో నిరూపించారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణను తప్పించుకోవడానికి మోదీ అడుగులకు మడుగులు ఒత్తుతూ ఉప రాష్ట్రపతి ఎన్నికకు బీఆర్ఎస్ ఎంపీలు దూరంగా ఉన్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో సుదర్శన్ రెడ్డికి ఎందుకు ఓటు వేయలేదు.

బీజేపీ, బీఆర్ఎస్ వేరు కాదు.. లోపాయికారీ ఒప్పందంలో ఉన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఇప్పటికే కవిత చెప్పారు. ముందు కవిత మాటలపై కేటీఆర్ సమాధానం చెప్పాలి. కవిత వ్యాఖ్యలపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కూడా ఎందుకు స్పందించడం లేదు. ఎందుకంటే రెండు పార్టీలు మానసికంగా ఒక్కటే కానీ.. భౌతికంగా ఒక్కటి కావాల్సి ఉంది. అందుకే రాహుల్‌పై కేటీఆర్ ఇలా మాట్లాడుతున్నారు' అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## రెండేళ్ల తర్వాత అయిన ప్రధాని మంచి నిర్ణయం తీసుకున్నారు : ఎంపీ ప్రియాంక గాంధీ

**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆ రోజు మణిపూర్ లో పర్యటించనున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆ రాష్ట్రంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. అయితే మణిపూర్ అలర్లు చెలరేగిన సమయంలో ప్రతిపక్షాలు అనేక సార్లు.. అక్కడ ప్రధాని మోడీ పర్యటించాలని డిమాండ్ చేశారు. కానీ అల్లర్లు జరిగిన 2 సంవత్సరాల తర్వాత ప్రధాని మోడీ మణిపూర్ పర్యటనకు వెళ్లేందుకు షెడ్యూల్ వచ్చింది. ప్రధాని మోడీ మణిపూర్ పర్యటనపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందిస్తూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "2 సంవత్సరాల తర్వాత ఆయన తన సందర్శన విలువైనదని నిర్ణయించుకున్నందుకు నేను సంతోషంగా ఉన్నాను. ఆయన చాలా కాలం ముందే మణిపూర్ ను సందర్శించి ఉండాలి. ప్రధాని ఏ పార్టీలో ఉన్నా, ఎక్కడ బాధలు వెళ్ళే సంప్రదాయం ఉంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అదే సంప్రదాయం కొనసాగుతోంది. కాబట్టి ప్రధాని మోడీ 2 సంవత్సరాల తర్వాత దానిని నెరవేరుస్తున్నారు. ఆయన దీని గురించి ముందే ఆలోచించి ఉండాల్సిందని తాను భావిస్తున్నట్లు ప్రియాంక గాంధీ మీడియాతో చెప్పుకొచ్చారు.

## నువ్వు మగాడివైతే వెంటనే రాజీనామా చేయ్.. కడియం శ్రీహరికి సవాల్

మాజీ ఎమ్మెల్యే ఆగ్రహంగా కడియం శ్రీహరి 200 కోట్లకు అమ్ముడుపోయి కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు ఆరోపించారు. "టాల్ మ్యాన్ అని చెప్పుకుంటావు కదా? ఏమైంది నీ పౌరుషం?" అని కూడా ప్రశ్నించారు. తాటికొండ రాజయ్య ఒక వైపు కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పడానికి భయపడుతున్నాడని చాటుకున్నారు. ఎంతవరకు స్పీకర్ చర్యలు తీసుకుంటారో చూడాలి, లేకపోతే స్పీకర్ ను న్యాయస్థానానికి లాగుతామని హెచ్చరించారు.

అంతేకాకుండా.. "కుక్కకు ఉన్న విశ్వాసం, ఇంగిత జ్ఞానం కడియం శ్రీహరికి లేదు. ఒకవేళ బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటే ఒప్పుకొని ముక్కు నేలకు రాసి కేసీఆర్ ని కలువు. బీఆర్ఎస్ లో ఉంటే తెలంగాణ భవన్ కు రా, యూరియా సమస్యలపై మాట్లాడి బీఆర్ఎస్ కు న్యాయం చేసే విధంగా ముందుకు వస్తే, తప్పకుండా నిన్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అంటాం," అని పేర్కొన్నారు.

## 811 టీఎంసీల కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 71శాతం డిమాండ్ చేస్తున్నాం: మంత్రి ఉత్తమ్



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఈ నెల 23 నుంచి కృష్ణా ట్రైబ్యునల్ విచారణ దృష్ట్యా.. నీటిపారుదల రంగ నిపుణులు, న్యాయ నిపుణులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌తో పాటు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. 811 టీఎంసీల కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 71శాతం డిమాండ్ చేస్తున్నామన్నారు. న్యాయంగా రావాల్సిన నీటివాటాను సాధిస్తామని తెలిపారు. ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపిస్తామని చెప్పారు. తాగు, సాగునీటితో సహా పరిశ్రమలకు నీటి వినియోగానికి చర్యలు తీసుకుంటామన్నారు. ట్రైబ్యునల్ విచారణ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వచ్చి సమీక్షిస్తారని తెలిపారు.

గత పాలకుల నిర్లక్ష్యమే కారణం..

తెలంగాణలో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు 65 శాతం మేర నీటి కేటాయింపులు ఉండాల్సిందేనని అన్నారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లుగా నీటి కేటాయింపులు ఉండాలని అందుకు అనుగుణంగా తాజా సమాచారాన్ని ట్రైబ్యునల్ కు సమర్పించామన్న ఉత్తమ్... ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని జారవిడుచుకోబోమని పునరుద్ఘాటించారు. జూన్, జూలై మాసాల్లో 80 టీఎంసీల నీటిని అందుబాటులో ఉంచడంతో పాటు ఆపరేషన్ ప్రోటోకాల్ అనుసరించి నీటిని వినియోగించుకునే స్వేచ్ఛ తెలంగాణకు ఉండేలా ట్రైబ్యునల్ ముందు ఉంచుతామని తెలిపారు. ఏపీ అక్రమంగా వినియోగిస్తున్న 291 టీఎంసీల నీటి ఉదంతం వెలుగులోకి వచ్చినందున... ఆ నీటిని పునర్విభజన చేయాల్సిందేనని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ అడ్డుపడుతోందని... రాష్ట్ర హక్కులను కూడా ట్రైబ్యునల్ ఎదుట జరిగే వాదనల్లో వినిపిస్తామని చెప్పారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల అంశాలతో కూడిన ప్రత్యేక జీఓను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లే కృష్ణా జలాలను తెలంగాణ వినియోగించుకోలేక పోయిందని భారత రాష్ట్ర సమితి నేతలపై ఉత్తమ్ మండిపడ్డారు. గత పాలకుల ఉదాసీనత కారణంగా ఏపీ అక్రమంగా నీటిని తరలించుకుపోయి ప్రయోజనం పొందిందని విమర్శించారు.

## ఎవరి అభివృద్ధి కోసం పార్టీ మారినవ్?.. గద్వాల ఎమ్మెల్యేను నిలదీసిన కేటీఆర్

ఈ 22 నెలల్లో గద్వాలలో ఏం అభివృద్ధి జరిగిందని అడిగారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గద్వాలకు కొత్తగా ఒక్క రూపాయి అయినా మంజూరయ్యిందా అని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు అని చెప్పి అరచేతిలో స్వర్గం చూపించారని అన్నారు. ఎన్నికల ముందు ఎన్నెన్నో మాటలు చెప్పారని పేర్కొన్నారు. కేసీఆర్ రైతుబంధు 10 వేలు ఇస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 15 వేలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. మరి 15 వేలు వస్తున్నాయా అని ప్రజలను ప్రశ్నించారు. రైతుబంధు 15 వేలు వస్తుందని కృష్ణమోహన్ రెడ్డి పార్టీ మారాడా అని మండిపడ్డారు. కేసీఆర్ 2 వేలు పెన్షన్ ఇస్తే.. నేను రూ.4వేలు ఇస్తానని చెప్పారని తెలిపారు. మరి 4వేల పెన్షన్ వస్తుందని పార్టీ మారాడా అని ప్రశ్నించారు. ఆడబిడ్డ పెళ్లికి కేసీఆర్ కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ కింద లక్ష రూపాయలు ఇస్తుంటే, నేను మీద నుంచి తులం బంగారం ఇస్తానని అన్నారని తెలిపారు. మరి తులం బంగారం వస్తుందా అని ప్రశ్నించారు. తులం బంగారం కోసం పార్టీ మారాడా అని ప్రశ్నించారు.

ఆడబిడ్డలకు రూ.2500లు ఇస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడని కేటీఆర్ గుర్తుచేశారు. అత్తకు రూ.4వేలు, కోడలికి రూ.2500 ఇస్తానని మాట ఇచ్చారని అన్నారు. ఏ ఆడబిడ్డకు అయినా రూ.2500 వచ్చాయా అని ప్రశ్నించారు. 1.67 కోట్ల మంది రూ.2500 కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని చూస్తున్నారని తెలిపారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పారని.. మరి రుణమాఫీ అయ్యిందా అని ప్రశ్నించారు. రుణమాఫీ అయ్యిందని ఎమ్మెల్యే పార్టీ మారాడా అని అడిగారు. ఇప్పుడు మీడియా అడిగితే బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నానని కృష్ణమోహన్ రెడ్డి చెప్పడం సిగ్గులేని విషయమని మండిపడ్డారు. మరి బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతుంటే.. బీఆర్ఎస్ మీటింగ్ ఇక్కడ అవుతుంటే.. ఎక్కడ ఉన్నావని ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

బీఆర్ఎస్ మీటింగ్ అవుతుంటే.. ఎమ్మెల్యే ఎక్కడ ఉన్నాడని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సంకల కృష్ణమోహన్ రెడ్డి ఉన్నాడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి దగ్గర ఉండి.. బీఆర్ఎస్‌లోనే ఉన్నానని సన్నాయి నొక్కులు నొక్కితే ఎవరు నమ్ముతారని అన్నారు. ఆయనకు సిగ్గులేకపోయినా.. మనకైనా సిగ్గు ఉండాలన్నారు. ఎవరెన్ని ఎత్తుగడలు వేసినా.. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. సుప్రీంకోర్టు మాత్రం సీరియస్‌గా ఉందని అన్నారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయకతప్పదు.. ఉప ఎన్నిక రాక తప్పదని స్పష్టం చేశారు.

**గద్వాలలో ఉప ఎన్నిక ఖాయం**

వచ్చే ఆరు నుంచి 9 నెలల్లో ఇదే గద్వాలలో తిరిగి ఉప ఎన్నిక వస్తుందని కేటీఆర్ తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేకు బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. పెద్దనాయకులు పార్టీని వదిలిపెట్టినప్పటికీ చాలామంది ఇక్కడే ఉన్నారని తెలిపారు. బలమైన సర్పం కూడా చలిచీమల చేతచిక్కి సచ్చినట్లు.. ఇవాళ బలవంతుడిగా కనిపించే ఎమ్మెల్యే గానీ.. కాంగ్రెస్ గానీ.. మీ దెబ్బకు దిగిరాక తప్పదని అన్నారు. గద్వాలలో జోష్ చూస్తుంటే.. ఉప ఎన్నిక రావడం ఖాయం.. అందులో 50 వేల మెజారిటీతో గులాబీ జెండా ఎగరడం ఖాయమని అనిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఇదే సరైన అవకాశం.. ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దు: సీఎం రేవంత్ ఆదేశం

కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను సాధించుకునేందుకు పట్టుబట్టాలన్నారు. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి న్యాయ నిపుణులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సిఉంది. తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్?రెడ్డి ఢిల్లీకి వెళ్లి స్వయంగా ఈ విచారణలో పాల్గొంటారని తెలిపారు.



కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై ఇంటిగ్రేటెడ్?కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంతకాలం కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి, మనకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేలా సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఈ సందర్భంగా న్యాయ నిపుణులకు పలు సూచనలు చేశారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలన్నీ ట్రిబ్యునల్ కు సమర్పించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ ముందు ఉంచాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంట్లు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్‌కు అందించాలని సూచించారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు కట్టబెట్టి, 299 టీఎంసీల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. గత ప్రభుత్వం 299 టీఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ట్రిబ్యునల్ ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సీఎంకి వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవటంతో ఈ పరిస్థితి వచ్చిందని సీఎం రేవంత్ అన్నారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైందన్నారు. కృష్ణా నదిపై తలపెట్టిన పాలమూరు – రంగారెడ్డి నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్‌లో పెట్టిందన్నారు. నీటి వాటాల విషయంలో తీరని అన్యాయం చేసిందన్నారు. దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాలో 904 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించటంతో ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోయిందని, ఆ విషయాన్ని ట్రిబ్యునల్? ముందుకు తీసుకురావాలని సీఎం చెప్పారు.శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే, పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా రోజుకు పది టీఎంసీల నీటిని ఏపీ మళ్లిస్తుందని, ఇతర బేసిన్లకు తరలించుకుపోతోందని అన్నారు. ఎక్కడపడితే అక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవటంతో పాటు పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నీ ఆధారాలతో సహా ట్రిబ్యునల్?కు నివేదించాలని, అందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా మళ్లించటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ తో పాటు పులిచింతల వద్ద ఉన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు మూత పడే ప్రమాదం ముంచుకు వచ్చిందన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే జల విద్యుత్తు ఉత్పత్తికి విఘాతం కలుగుతోందన్నారు. ఈ విషయాలన్నీ ట్రిబ్యునల్ ఎదుట వాదనలుగా వినిపించాలని ఆదేశించారు.కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కావటంతో తెలంగాణకు రావాల్సిన హక్కులు, నీటి వాటాలను సాధించుకునేందుకు అన్ని అర్హతలున్నాయని అన్నారు. సాగునీటి, తాగునీటి అవసరాలతో పాటు మెట్ట ప్రాంతం, కరువు ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్?నగర్?, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. ఇప్పటి వరకు తెలంగాణా ప్రాంతంలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించుకోలేకపోయిందని గుర్తు చేయాలన్నారు. తెలంగాణ తరఫున వాదనలను వినిపించేందుకు ఇదే సరైన అవకాశమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు, కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్తును దిశానిర్దేశం చేసే వాదనలు కావటంతో ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దని న్యాయ నిపుణులకు సూచించారు.

## లవర్ మోజులో పడి కన్న కూతురుని కడతేర్చిన తల్లి

**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** అక్కడ కూతురిని హత్య చేసిన అనంతరం డెడ్‌బాడీని బైక్‌పై స్వగ్రామానికి తీసుకొచ్చి పూడ్చివేసి తిరిగి వెళ్లిపోయింది. చివరకు పోలీసులు ఇద్దరినీ పట్టుకోవడంతో చిన్నారి హత్య విషయం బయటపడింది.శభాష్‌పల్లికి చెందిన బంటు మమతకు రాయపోల్ మండలం వడ్డేపల్లికి చెందిన భాస్కర్‌తో ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వారికి కొడుకు చరణ్, కూతురు తనుశ్రీ ఉన్నారు. మమతకు ఏడాది కిందట శభాష్‌పల్లికి చెందిన ఫయాజ్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో ఫయాజ్, మమత గత మార్చిలో ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఐతే భర్త భాస్కర్ ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన రాయపోల్ పోలీసులు.. ఇద్దరిని హైదరాబాద్‌లో పట్టుకున్నారు. తిరిగి గ్రామానికి తీసుకొచ్చారు. పెద్దల సమక్షంలో మమతకు నచ్చజెప్పి తిరిగి అత్తారింటికి పంపించారు.

అంతా బాగుంటుంది అనుకున్న సమయంలో మే 21న శభాష్‌పల్లిలో ఉన్న మమత.. తన కూతురు తనుశ్రీని తీసుకొని మరోసారి ఫయాజ్‌తో వెళ్లిపోయింది. మమత తండ్రి ఫిర్యాదుతో శివ్వంపేట పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో వారు ఏపీలోని నర్సరావుపేటలో ఉన్నట్లు గుర్తించారు. మళ్లీ ఇద్దరినీ శివ్వంపేటకు తీసుకొచ్చి చిన్నారి గురించి అడిగారు. ఆ సమయంలో చిన్నారిని హత్య చేసిన విషయం బయటపడింది.

జూన్ 7న తనుశ్రీని గొంతు నులిమి చంపేసినట్లు మమత ఒప్పుకుంది. అంతే కాదు.. బైక్‌పై నరసరావుపేట నుంచి శభాష్‌పల్లికి తీసుకొచ్చి గ్రామ శివారులోని కాల్వ పక్కన పూడ్చివేసి తిరిగి వెళ్లిపోయినట్లు చెప్పింది. ఆమె ఇచ్చిన సమాచారంతో కాల్వ పక్కన తవ్వి చిన్నారి డెడ్‌బాడీని బయటకు తీశారు పోలీసులు. అక్కడే పోస్ట్‌మార్టం చేయించి చిన్నారి డెడ్ బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించారు. చిన్నారిని అత్యంత దారుణంగా చంపేసిన తమ కూతురు మమతను కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.ఈ కేసులో ప్రియుడు ఫయాజ్‌తోపాటు మమతను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## జనజీవన స్రవంతిలోకి మావోయిస్టు సుజాతక్క.. 43 ఏళ్ల అజ్ఞాత జీవితానికి ముగింపు..






**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** గద్వాల ప్రాంతానికి చెందిన మావోయిస్టు సుజాతక్క 43 ఏళ్ల అజ్ఞాత జీవితానికి ముగింపు పలికారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క తెలంగాణ పోలీసుల ఎదుట శనివారం లొంగిపోయారు. ప్రస్తుతం ఆమె మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న ఏకైక మహిళా నాయకురాలు. పశ్చిమబెంగాల్‌లో 2011 జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య ఆమె. సుజాతక్కపై రూ.కోటి రివార్డు ఉంది. ఆమె 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఛత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జిగా ఉన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. 'ఆమె స్వస్థలం గద్వాల జిల్లా గట్టు మండలం పెంచికలపాడు. ఆమె మొదట్లో ఆర్ఎస్‌యూ, జన నాట్యమండలిలో పని చేశారు. 1996లో కమాండర్‌గా విధులు నిర్వహించారు. 2001లో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. అనారోగ్య కారణాలతో సుజాతక్క బయటికి వచ్చారు. ఆమెకు రూ.25 లక్షల రివార్డు అందిస్తాం. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని ఆహ్వానిస్తున్నాం. మావోయిస్టులు చాలా మంది లొంగిపోతున్నారు అని తెలిపారు. ప్రస్తుతం సీపీఐ మావోయిస్టు పార్టీలో తెలంగాణకి చెందిన వారు 78 మంది ఉన్నారు. ప్రస్తుతం ఉన్న 15 మంది కేంద్ర కమిటీ సభ్యుల్లో 10 మంది తెలంగాణకు చెందినవారు ఉన్నారు. మావోయిస్టుల లొంగుబాటు అనేది అంత సులభంగా జరుగదు. మావోయిస్టులు లొంగిపోవడం అనేది రెండు, మూడు రోజుల్లో సాధ్యం అయ్యేది కాదు. పోలీసులకు మావోలు లొంగిపోవాలంటే ఒక ప్రాసెస్ ప్రకారం జరుగుతుంది. దాని ప్రకారమే వారు లొంగిపోతారు. గతేడాది 22 మంది మావోయిస్టులు తెలంగాణలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 10 మంది మావోయిస్టులు తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. గతంలో కూడా పోలీసులకు మావోయిస్టులకు మధ్య చర్చలు జరిగాయి. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో మావోయిస్టులు వారిని కాపాడుకునేందుకే చర్చల ప్రతిపాదనను తెరపైకి తీసుకొస్తున్నారు. తెలంగాణ కమిటీలో 11మంది మావోయిస్టులు తెలంగాణ వారు, ఇతర రాష్ట్రాల వారు 62 మంది ఉన్నట్లు గుర్తించాం. తెలంగాణ కమిటీలో మొత్తం 73మంది మావోయిస్టులు ఉన్నట్లు డీజీపీ జితేందర్ పేర్కొన్నారు.

## నేనే సీనియర్.. జూబ్లీహిల్స్‌లో పోటీ చేస్తా : అంజన్ కుమార్ యాదవ్ ప్రకటన



పార్టీలో, సిటీలో నాకంటే సీనియర్ ఎవరూ లేరు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తా' అని కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా, ఈనెలలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల కానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఉప ఎన్నికలో విజయం సాధించాలని తెలంగాణలోని వివిధ రాజకీయ పార్టీలు తమదైన శైలిలో వ్యూహాత్మకంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. అలాంటి వేళ.. మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

## ఊరుకునేదే లేదు.. సీఎం రేవంత్ రెడ్డికి నాగం జనార్దన్ రెడ్డి వార్నింగ్



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి గండి కొట్టి నల్లగొండ జిల్లాకు నీటిని తరలించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగం జనార్దన్ రెడ్డి హెచ్చరించారు. ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేసేందుకు పూనుకుంటే పార్టీలకతీతంగా ఉద్యమిస్తానని హెచ్చరించారు. అందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే విస్తీర్ణంలో పెద్దదిగా ఉన్న ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులకు అన్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంటున్నదని నాగం జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. అలాంటి ప్రయత్నాలు మానుకోకుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిని, ప్రభుత్వాన్ని నాగం జనార్దన్ రెడ్డి హెచ్చరించారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటుపరం చేస్తే ప్రతిఘటన తప్పదు

**పనిభద్రత, కనీస వేతనాలకోసం సమిష్టిగా పోరాడుదాం**

**వేతనపెంపు హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి**

**మధ్యాహ్న భోజన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**ఉత్సాహంగా మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా 3వ మహాసభ**






**కొత్తగూడెం, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ప్రతిఘటన ఉద్యమాలు తప్పవని ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా హెచ్చరించారు. యూనియన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభ సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో శనివారం జరిగింది. మహాసభకు ముఖ్య అతిధులుగా హాజరైన నాయకులు మాట్లాడుతూ పేద విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే లక్ష్యం నెరవేరదనే ఉద్దేశంతో గౌరవ సుప్రీం కోర్టు ప్రైవేటుకు నిరాకరిస్తూ గైడ్లైన్స్ విడుదల చేసిందని దీన్ని రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా పాటించి సెంట్రలైజ్డ్ కిచెన్ విధాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న కార్మికులకు రూ.10వేల గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లు కావస్తున్నా ఆ హామీని అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తోందని, వేతన పెంపు హామీని నిలబెట్టుకొని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ పథకం లక్ష్యం నెరవేరాలంటే స్లాబ్ రేటు రూ.25లకు నిర్ణయించి విడుదల చేయాలని, సాధ్యంకాని పక్షంలో నిత్యావసరాలు, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పనిభద్రత కల్పించేందుకు గుర్తింపు కార్డులతో పాటు, తహసీల్దార్ల ద్వారా ప్రొసీడింగ్ అర్డార్లు ఇచ్చి డ్రస్ కోడ్ అమలు చేయాలని కోరారు. ఏ సంస్థలో లేని విధంగా ప్రభుత్వం ఏడాదికి 10 నెలల వేతనం మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంటోందని, ఏది సరైంది కాదని, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులను పరిగణలోకి తీసుకొని పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. వంట కార్మికులను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద భీమా, టర్మినల్ బెనిఫిట్ అమలు చేయాలని కార్మికులు, కార్మిక సంఘాలు చేస్తున్న డిమాండ్ న్యాయమైందని ఆ దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాన నిలబడి వారి హక్కుల సాధన, పరిరక్షణకోసం నిలబడి పోరాడేది ఏఐటీయూసీనేనని, ఏఐటీయూసీ పక్షాన చేరి కార్మికోధమాలకు మరింత బలాన్ని అందించాలని పిలుపునిచ్చారు. మహాసభలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, వేర్పుల మల్లికార్జున్, నిమ్మటూరి రామకృష్ణ, సత్తెనపల్లి విజయలక్ష్మి, దాసుల పుష్పవతి, ఎన్ ప్రభావతి, పైడిపల్లి లక్ష్మి, షహీన్, మంగ, నర్సమ్మ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గోపయ్యకి ఘన నివాళులు

**భద్రాద్రి జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు**



**కొత్తగూడెం, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ దుద్దుకూరి రామారావు తండ్రి గోపయ్య ఇటీవల మృతి చెందగా జూలూరుపాడులోని వారి గృహానికి గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు వెళ్లి శనివారం పరామర్శించారు. తొలుత గోపయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. రైతు కుటుంబ నేపథ్యం కలిగిన గోపయ్య రైతులతో పాటు జూలురుపాడు ప్రజలకు సుపరిచితులుగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. చైర్మన్ వెంట.. శివవర్ధిని ఆగ్రో ఏజెన్సీస్ అధినేత పసుపులేటి శివకృష్ణ, సాదం నరసింహారావు, బుక్య రవి, గోపి, యువజన కాంగ్రెస్ నాయకులు గూగుల్ ప్రవీణ్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**రోకటి సురేష్ కుటుంబానికి పరామర్శ**

జూలూరుపాడుకు మండలం పాపకొల్లు గ్రామం నందు రోకటి సురేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో వాళ్ళ కుటుంబం చాలా సంవత్సరాలు కష్టపడ్డారని, అలాగే మంచి మనిషి అని అన్నారు. వాళ్ళ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో శివ వర్ధిని ఆగ్రో ఏజెన్సీస్ అధినేత జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుపులేటి శివకృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కూర ప్రసాద్ కు మాతృవియోగం

**సంతాపం తెలిపిన ఆర్యవైశ్య మహాసభ కొత్తగూడెం పట్టణ కమిటీ**



**కొత్తగూడెం, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** కొత్తగూడెం పట్టణ ఆర్యవైష్య మహాసభ కమిటీ సభ్యులు కూర ప్రసాద్ మాతృమూర్తి కూర నాగలక్ష్మి(85) సిద్దిపేట జిల్లా దుబ్బాకలో మరణించారు. కూరా నాగలక్ష్మి మృతి పట్ల బంధుమిత్రులు, ఆర్యవైశ్య మహాసభ బాధ్యులు సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేరాలని కోరారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని కోరారు. సంతాపం తెలిపిన వారిలో కొత్తగూడెం పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దారా నగేష్, ప్రధాన కార్యదర్శి కొదుమూరి సురేష్ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు వల్లాల రమణ( దివ్య ట్రెండ్స్), కమిటీ సభ్యులు నరేంద్రుల రిషి కుమార్, గునిపాటి సుధాకర్ తదితరులు ఉన్నారు

# మాకు న్యాయం చేయండి మహాప్రభో

**వైద్యం పేరుతో డబ్బులు వసూలు చేసుకొని శవాన్ని చేతిలో పెట్టారు**

**మా ప్రమేయం లేకుండానే అంబులెన్సులో తరలించి మాపై నిందలా**

**సమగ్ర విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు చేశాం**

**మీడియా సమావేశంలో బాధితులు జర్పుల రమేష్**




ఖమ్మం బ్యూరో, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్): వైద్యం పేరుతో డబ్బులు వసూలు చేసుకుని తమ చేతిలో కొడుకు శవాన్ని చేతిలో పెట్టారని, మా ప్రమేయం లేకుండా అంబులెన్స్‌లో తరలించి ఆ పై మాపై నిందలేస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని బాధితులు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అనేపురం, వెంకట్ తండా గ్రామానికి చెందిన జర్పుల రమేష్ కుటుంబీకులు కోరారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో రమేష్ మాట్లాడుతూ తన కొడుకు అరవింద్‌కు జ్వరం వస్తుండడంతో ఖమ్మం సాయిరామ్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్‌లో చేర్పించామన్నారు. ఆరు రోజుల ట్రీట్మెంట్ అనంతరం వెంటిలేటర్ పై బాబు ఉన్నారని చెప్పేసి మాకు తెలియకుండానే వారి హాస్పిటల్ అంబులెన్స్‌లో నన్ను బెదిరించి అదే హాస్పిటల్ లోకి పంపించారని, ఎక్కడకని అడిగినా ఏమీ చెప్పకుండా తమ గ్రామానికి వెళ్లే రోడ్డుకి తీసుకెళ్లారని, మార్గం మధ్యలో వారికి సంబంధించిన ఇద్దరు డాక్టర్లు వచ్చి బాబుకి ఉన్న వెంటిలేటర్‌ను తీసి మీ బాబు ఎప్పుడో చనిపోయారు, అక్కడే చెప్తే మీరు గొడవ చేస్తారని మమ్మల్ని పంపించారని చెప్పడంతో కన్నీరుమున్నీరయ్యామని తెలిపారు. తమ బాబుకి గతంలో ఉన్న అనారోగ్యా సమస్యలను చెప్పామని, ఏం కాదు మా వంతు ప్రయత్నం తాము చేస్తామని హాస్పిటల్లో చేర్చుకున్నారని అన్నారు. సీరియస్ గా ఉందని ఐసీయూలో ఉంచి మమ్మలెవ్వరినీ బాబు దగ్గరికి వెళ్లనీయకుండా చేశారని వాపోయారు. ఆరు రోజుల వరకు బాబుకు ట్రీట్‌మెంట్ నడుస్తోందని, లక్ష రుపాయలు కడితే 48 గంటల్లో రికవరీ అవుతారని, ఎలాంటి ఇబ్బంది లేదు అని చెప్పేసి రెండు రోజుల తర్వాత మీ బాబు కోమాల్లోకి వెళ్లారని, అతనికి సిటీ బ్రెయిన్ స్కాన్ తియ్యాలని చెప్పారన్నారు. సిటీ బ్రెయిన్ స్కాన్ చేయించి తర్వాత డయాలసిస్ చేయాలని చెప్పారని, నిమ్స్‌లో లివర్లు పాడయ్యాయని చెబితే డయాలసిస్ చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించినట్లు తెలిపారు. డయాలసిస్ చేసిన తర్వాత బాబు వెంటిలేటర్ మీద ఉన్నాడని మీరు పూర్తి ఫీజు కట్టాలని లక్షల్లో డబ్బులు వసూలు చేసి మాకు తెలియకుండానే వారి అంబులెన్స్ లో మా గ్రామానికి వెళ్లే మార్గంలోకి తీసుకెళ్లారన్నారు. మార్గం మధ్యలో తాము సాయిరామ్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ సిబ్బంది అని, మీ బాబుకు ఉన్న వెంటిలేటర్ తీసేయమని చెప్పి మమ్మల్ని పంపించారని, మీ బాబు చనిపోయారని చెప్పారన్నారు. మా ప్రమేయం లేకుండా వారి అంబులెన్స్ లోనే బయటికి పంపించాల్సిన అవసరం ఏమి వచ్చిందన్నారు. పేషెంట్ కండిషన్ ఏమైనా ఉంటే అదే నాకు వివరించి ప్రత్యామ్నాయం చూయించాలి కానీ నా ప్రమేయం లేకుండానే వారి ఆంబులెన్స్ లోనే తీసుకెళ్లడంతోనే మాకు అనుమానాలు కలిగాయని అన్నారు. ఈ విషయమై ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరవింద్ తల్లి ఆదిలక్ష్మి, చందులాల్ కోటేష్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్.రవి, కిషన్ నాయక్, సిరి, రవి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం నుంచి ఉన్నత విద్యాసంస్థల నిరసన కార్యక్రమాలు



**ఖమ్మం బ్యూరో, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** డిగ్రీ, పిజి, ఫార్మసి, బి.ఈడి, యం.బి.ఎ., యం.సి.ఎ., ఇంజనీరింగ్ విద్యాసంస్థల రాష్ట్ర ఐక్య కార్యచరణ కమిటీ పిలుపు మేరకు స్థానిక యస్.బి.ఐ.టి. అటానమస్ కళాశాలలో జిల్లా ఇంజనీరింగ్ విద్యా సంస్థల యాజమాన్యాల అధ్యక్షుడు చలసాని సాంభశివరావు అధ్యక్షతన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన విద్యాసంస్థల యాజమాన్యాలు మరియు విద్యార్థి సంఘాల ప్రతినిధులతో శనివారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబుర్స్ మెంట్ సమస్య అనేది విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సంబంధించినదని యాజమాన్యాలకు సంబంధించినది కాదని, ప్రభుత్వ నిర్ణయాల వల్ల కళాశాలను నడపటం కష్టతరంగా మారిందని తెలిపారు. అట్టడుగు బలహీన వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన ఒపెన్ కేటగిరీ విద్యార్థులకు కూడ ఉపయోగపడి వారి జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకొనివెళ్ళడంలో కీలకంగా ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కీమ్ గత 3 సంవత్సరాలుగా ప్రభుత్వ నిర్లక్ష వైఖరి తో కళాశాల యాజమాన్యాలు ఆర్థికంగా చితికిపోయి నాణ్యమైన విద్యను అందించటం క్లిష్టతరంగా మారిందని తెలిపారు. ఈ సందర్భంగా చేపట్టే నిరసన కార్యక్రమాలలో భాగంగా సోమవారం రోజు మధ్యహ్నం ఖమ్మం లోని అన్ని విద్యాసంస్థల విద్యార్థులను విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సెంటర్లో గల అంభేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అదే విధంగా మంగళవారం ధర్నాచౌక్ నందు యాజమాన్య సంఘాలు మరియు అధ్యాపకులు నిరాహార దీక్షను చేపట్టి తదుపరి కార్యక్రమాన్ని ఆ రోజు ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్.బి.ఐ.టి. కృష్ణ, విజయ కాలేజి ఉషాకిరణ్, శ్రీ చైతన్య శ్రీధర్, ప్రియదర్శిని నవీన్, మ్యాక్స్ కాలేజి సత్యనారాయణ, డిగ్రీ కళాశాలల భాద్యులు ప్రభాకర్ రెడ్డి మరియు ఇతర విద్యాసంస్థల యాజమాన్యాలు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ సాంబ కుటుంబ సభ్యులకు ఎంపీ వద్దిరాజు పరామర్శ



**ఖమ్మం బ్యూరో, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** పోలీసులు అక్రమ కేసు బనాయించి వేధింపులకు గురవుతున్న టీ న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి సాంబశివరావు కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలు పరామర్శించి తాము కొండంత అండగా ఉంటామని భరోసానిచ్చారు. యూరియా కోసం అగచాట్లు పడుతున్న రైతుల గురించి వార్తలు సేకరిస్తున్న సాంబశివరావుపై ఖమ్మం జిల్లా కొణిజర్ల పోలీసులు అక్రమ కేసు బనాయించడం తెలిసిందే.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శనివారం మధ్యాహ్నం ఖమ్మం బంగారయ్య నగర్ లోని సాంబశివరావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఎంపీ రవిచంద్ర పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కే.టీ.రామారావుకు ఫోన్ చేసి సాంబశివరావు సతీమణి శ్రీదేవితో మాట్లాడించారు. పోలీసు కేసుతో అధైర్యపడవద్దని, తమతో పాటు బీఆర్ఎస్ కొండంత అండగా ఉంటుందని శ్రీదేవిని కేటీఆర్ పరామర్శిస్తూ భరోసానిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే, ప్రశ్నించే, వార్తలు రాసే, ప్రసారం చేసే విలేకరుల పై, సోషల్ మీడియా వారియర్స్, సామాజిక కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేయడం పరిపాటిగా మారిందని కేటీఆర్ ఆవేదన చెందారు. ఇలాంటి పరిస్థితుల్లో అధైర్యపడకుండా, పిల్లలు కలత చెందకుండా చూసుకోవాలని,మీ కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని కేటీఆర్, రవిచంద్రలు సాంబశివరావు సతీమణి శ్రీదేవి, అత్త మల్లమ్మ, కూతురు సహస్రలకు ధైర్యం చెప్పారు.

# భట్టి ఓటమి భయంతో భట్టి ప్రలోభాలకు దిగాడు -లింగాల కమల్ రాజ్

**బ్రోకర్లతో భట్టి చిల్లర రాజకీయాలు చేయిస్తున్నాడు**

**మధిరలో బిఆర్ఎస్ పార్టీని ఇంచు కూడా కదిలించలేవు**

**పోలీసులు ఫోన్లు చేసి మా నాయకులను బెదిరిస్తున్నారు..**

**గత పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏనాడు అలా జరగలేదు**

**మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు**



**చింతకాని, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** చింతకాని మండల ముఖ్య నాయకుల సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కమల్ రాజు మాట్లాడుతూ.. భట్టి విక్రమార్క అధికార మదంతో,ఓటమి భయంతో.. బిఆర్ఎస్ పార్టీ నాయకులను ప్రలోభాలకు గురిచేస్తున్నారు అని విమర్శించారు. కమిషన్లతో వచ్చే డబ్బులతో ప్రలోభాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మధిర నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని కదిలించడం భట్టి విక్రమార్క తరం కాదని కమల్ రాజు దుయ్యబట్టారు, అదేవిధంగా భట్టి విక్రమార్క చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. పోలీసులు, అధికారులు కొంత మంది బిఆర్ఎస్ నేతలుకు ఫోన్ చేసి కాంగ్రెస్లో కి చేరాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు అని తన దెగ్గర ఆధారాలు కూడా ఉన్నాయని కమల్ రాజు ఆరోపించారు.వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని.. మిత్తితో సహా చెల్లిస్తాం అని ఈ సందర్భంగా హెచ్చరించారు. సోషల్ మీడియా కార్యకర్తలకు ఫోన్ చేసి బెదిరిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చింతకాని మండల అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# రిక్కా బజార్ వీధిలైట్లకు మోక్షం - తుమ్మల యుగంధర్ కృషి



**ఖమ్మం టౌన్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మంనగరంలోని 25వ డివిజన్లో రోడ్డు వెడల్పుల భాగంగా రిక్కా బజార్ సెంటర్ నుంచి ముత్యాలమ్మ గుడి సెంటర్ వరకు గత ఆరు నెలలుగా వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు మహిళల భద్రత దృష్ట్యా వృద్ధులు మరియు వికలాంగులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రిక్క బజారులో వీధిలైట్లను అమర్చినారని తెలియజేస్తున్నాము. విజయదశమిని పురస్కరించుకొని దేవి నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా రిక్కా బజార్ నివాసులు బావ సార్ క్షత్రియ మండలి మాతా శ్రీ అంబా భవాని గుడి కమిటీ వారు వీధి దీపాల గురించి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు మాజీ కార్పొరేటర్ నరసింహారావు దృష్టికి తీసుకొని రాగా తుమ్మల గారికి విన్నవించగా తక్షణమే మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్తే గారి దృష్టికి తీసుకొని రాగా తుమ్మల నాగేశ్వరావు గారి ఆదేశానుసారం లైట్లను ఏర్పాటు చేసినందుకు 25 డివిజన్ కాంగ్రెస్ కమిటీ తరఫున రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు గారికి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ గారికి మరియు వద్దే బోయిన నరసింహారావు గారికి మున్సిపల్ కమిషనర్ గారికి మరియు మున్సిపల్ ఎలక్ట్రిసిటీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# గొప్ప సిద్ధాంతకర్త కామ్రేడ్ సీతారాం ఏచూరి

## వర్ధంతి సభలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రం



**ఖమ్మం టౌన్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** మార్క్సిజాన్ని భారతదేశానికి అన్వయించి ముందుకు తీసుకు పోవడంలో సీతారాం ఏచూరి కి మించిన కమ్యూనిస్టు మరొకరు లేరని ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రం అన్నారు. శనివారం ఖానాపురం హవేలీ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ వర్ధంతి సభలో ముఖ్యఅతిథిగా విక్రం పాల్గొని మాట్లాడుతూ భారతదేశ నిర్దిష్ట పరిస్థితులను అంచనాగట్టి మతోన్మాద ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి ఒకవైపున మతోన్మాదంపై పోరాడుతూనే మరోవైపున పార్టీ సిద్ధాంతాన్ని కార్యక్రమాలకు అన్వయిస్తూ మార్క్సిస్ట్ పార్టీని ముందుకు నడిపించడంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సక్సెస్ అయ్యారని అన్నారు. భారతదేశంలో 2019లో రెండవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి, ఆర్ఎస్ఎస్ ల మతోన్మాద ప్రమాదాన్ని అంచనాగట్టి దేశంలో ఉన్న లౌకిక పార్టీలను ఏకం చేసి మతోన్మాదానికి వ్యతిరేకంగా పార్లమెంటులోనూ పార్లమెంటు వెలుపల ఉద్యమాలు నిర్వహించి 2024 ఎన్నికల్లో బిజెపికి గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఇండియా కూటమిని ఏర్పాటు చేయటంలో సీతారాం ఏచూరి గొప్ప కృషి సల్పాడని అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ ల మతోన్మాదాన్ని, అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనే ఈ సమయంలో సీతారాం ఏచూరి లేని లోటు స్పష్టంగా కనబడుతుందని అన్నారు. పార్టీ నిర్మాణం విషయంలోనూ కామ్రేడ్ సీతారాం ఏచూరి కఠినమైన వైఖరితో ఉండేవాడని, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో సోషలిజం ముందుకు పోతున్న తీరుతెన్నులను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తూ భారతదేశంలో కూడా సోషలిజం తీసుకురావాలని విప్లవ సైనికుడుగా పని చేశాడని అన్నారు. సీతారామ్ ఏచూరీ తెలుగు కుటుంబంలో పుట్టి ప్రపంచ ప్రఖ్యాత కమ్యూనిస్టుగా పేరు తెచ్చుకోవడం మనందరికీ గర్వకారణం అన్నారు. సీతారాం మెచూరి కి ఖమ్మం తో విడదీయరాని బంధం ఉందని, ఖమ్మంలో ఏ మీటింగ్ బహిరంగ సభ జరిగినా ఆయన వచ్చి తెలుగులోనే ప్రసంగించేవాడని, తెలుగులో మాట్లాడడం అంటే ఆయనకు ఎంతో అమితమైన ప్రేమ అని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాల ద్వారా సోషల్ లేదు సాధన కోసం పని చేయటమే ఆయనకు ఇచ్చే నివాళులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య డివిజన్ కమిటీ సభ్యులు గాలి వెంకటాద్రి పోతురాజు వెంకటి మండల నాయకులు జట్ల ఆనందరావు గాలి అంజయ్య తిప్పర్తి నరసింహారావు తోట నాగరాజు వంగూరి రమ, అమరబోయిన అంజని, పందుల నాగమణి, వడ్డేపల్లి నరేంద్ర, వేదగిరి మురహరి కర్ల వీరస్వామి మాచర్ల గోపాల్ సీనియర్ నాయకులు పెద్ది నాగయ్య, కందాల వికాస్ రెడ్డి నర్వనేని పురుషోత్తమరావు, తాత తిలక్నాథ్, కోరిన్నీ వెంకటేశ్వరరావు, మోటపోతుల వెంకటేశ్వర్లు, కుర్రి రవి, బొగ్గరపు పాపారావు, దంతాల కేశవులు శ్రీరామనేని అలివేలు, జెకె తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ స్టేట్ వర్క్ షాప్ కు హాజరైన వేజెండ్ల సాయి



**హైదరాబాద్ బ్యూరో, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ గాంధీ భవన్ లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన స్టేట్ ఎక్స్టెండెడ్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ కి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నేషనల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఉదయభాను చిప్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, టీపీవైసీ ఇంచార్జ్ ఖలీడ్ ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఓటు చోరీ కార్యక్రమంపై దిశా నిర్దేశాలు చేయడం జరిగింది. మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై యువతకు 20 శాతం సీట్లు కేటాయించడంపై చర్చించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయి కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతీ యువజన కాంగ్రెస్ కార్యకర్త మీ మీ వార్డులలో కనీసం రోజుకు 2గంటలు కేటాయించి ఓటర్ లిస్ట్ తీసుకొని ఇంటింటికి తిరిగి ఓట్ చోరి గురించి ప్రతి ఒక్కరికి తెలియచేయాలనీ చెప్పారు. మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, కో- కో ఆర్డినేటర్లు పాల్గొనడం జరిగింది.



# టెట్ తీర్పు పై సుప్రీంకోర్టులో ప్రభుత్వం అప్పీల్ చేయాలి

## సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

## అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి- టియస్ యుటియఫ్



**ఖమ్మం ఎడ్యుకేషన్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఇటీవల సుప్రీంకోర్టు ఉపాధ్యాయులందరూ సర్వీస్ లో కొనసాగాలన్నా, పదోన్నతి పొందాలన్నా టెట్ ( టెట్- టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్ ) తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు సీనియర్ ఉపాధ్యాయులకు ఆశనిపాతంలాగా మారిందని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నాడు షేక్ రంజాన్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్లలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించిందని కానీ సుప్రీంకోర్టు తీర్పు సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం కలిగించే విధంగా ఉందని, ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టు తీర్పుపై అప్పీల్ చేసి సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఎన్సీటీఈ నోటిఫికేషన్ రాకముందు నియామకమైన ఉపాధ్యాయులందరికీ టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇటీవల పదోన్నతుల్లో చేరకుండా మిగిలిపోయిన ఖాళీ పోస్టులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని, గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్స్ ఏర్పడి దశాబ్ద కాలం దాటినా నేటివరకు పదోన్నతులు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందటం లేదని, కోర్టు సమస్యలు పరిష్కరించి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అశాస్త్రీయమైన గురుకుల టైం టేబుల్ ను మార్చాలని ,గురుకుల, ఎయిడెడ్ ,మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. తెలుగు ,హింది, పిఈటి పోస్టులు అభ్యర్థులు లేక ఖాళీగా మిగులుతున్నందున సర్వీస్ రూల్స్ సవరించి ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిప్యూటీ డిఈఓ ,డైట్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెండింగ్లో ఉంచిన ఐదు డీఏలను విడుదల చేయటంతో పాటు ఈకుబేర్ లో ఉన్న పెండింగ్ బిల్లులను చెల్లించాలని, తెలంగాణ రెండవ పిఆర్సి నివేదిక తెప్పించి, జూలై 2023 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముందుగా ఇటీవల మరణించిన పూర్వ జిల్లా అధ్యక్షులు జియావుద్దీన్ మృతికి ఘనంగా నివాళులర్పించనైనది. ఈ సమావేశంలో కుటుంబ సంక్షేమ నిధి రాష్ట్ర కార్యదర్శి జీవీ నాగమల్లేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి. వెంకన్న, షమీ కోశాధికారి వల్లంకొండ.రాంబాబు, జిల్లా కార్యదర్శులు బానోత్ రాందాస్, నర్సయ్య,సురేష్, నాగేశ్వరరావు, రామారావు, నిర్మలాకుమారి, ఉద్దండ్, ఉమామహేశ్వరరెడ్డి, నాగూర్ వలీ, విజయ్ కుమార్,రామకృష్ణ, కోటేశ్వరరావు, పద్మ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యానగర్ సమగ్ర అభివృద్ధి కోరుతూ పాదయాత్ర ప్రారంభించిన కార్పొరేటర్ జ్యోతి రెడ్డి



**ఖమ్మం టౌన్,, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం నగరపాలక సంస్థ కైకొండాయిగూడెం, పాండురంగాపురంలలోని ఒకటి, నాలుగు డివిజన్లలో విస్తరించి ఉన్న విద్యానగర్ సమగ్ర అభివృద్ధి కోరుతూ, కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు ఈరోజు ఉదయం పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రను నాలుగో డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి జాతీయ పతాకాన్ని ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బండి నరసింహారావు మాట్లాడుతూ గత 14 సంవత్సరాల నుండి ఈ కాలనీలో నివాసం ఉంటున్నప్పటికీ కార్పొరేషన్ మరియు ప్రభుత్వం ఏ విధమైన అభివృద్ధి చర్యలు చేపట్టలేదని, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్, వీధిలైట్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. రోడ్లకు నెంబర్లు కేటాయించి బోర్డులు పెట్టడం కూడా కనీసం చేయలేదని, దానితో కాలనీ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వర్షాకాలంలో మురుగునీరు ఎక్కడకక్కడ నిలిచిపోయి దోమలతో రోగాలు వ్యాప్తి చెందడంతో పాటు బురద రోడ్లు వలన వాహనాల్లో వెళ్లే వారు జారి పడిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ "సిటీజెన్ బడ్డీయాప్ లో" విద్యానగర్ పేరు చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కాలనీలో నివసిస్తున్న ప్రజల సమస్యల మీద సర్వే నిర్వహించి ఖమ్మం కార్పొరేషన్ మేయర్ కు, కమిషనర్ కు ప్రాతినిధ్యాలు చేశామన్నారు. కాలనీలో 250 ఇళ్ళు, 350 కి పైగా కుటుంబాలు, 1200 జనాభా నివసిస్తున్నప్పటికీ, ఖమ్మం, పాలేరు రెండు నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్నప్పటికీ మారుమూల గ్రామాల కన్నా అధ్వాన్నంగా ఉందని, తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, సమస్యల పరిష్కారానికి ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులతో పాటు ఖమ్మం, పాలేరు నియోజకవర్గ శాసనసభ్యులుగా ఉన్న ఇరువురు మంత్రులు ప్రాధాన్యతనిచ్చి కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ హాజరైన నాలుగో డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం తన శక్తి మేరకు ప్రయత్నం చేస్తున్నానని,రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నాని మిగిలిన సమస్యల పరిష్కారం కోసం కూడా కాలనీవాసులతో కలిసి పాటుపడతానని హామీ ఇచ్చారు.టిఎస్యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వర రావు, రైతు సంఘం నాయకులు బత్తిన ఉపేంద్ర సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బానోత్ బాలు నాయక్, జాలాది లెనిన్, గోదా వెంకట నాగమల్లేశ్వరరావు, బండి నాగేంద్ర, వసుంధర, తూము రాంబాబు, రబ్బానీ,జగదీష్, వెంకటేశ్వరరెడ్డి,రేగులగడ్డ రామరావు, బసవ నాగేశ్వర రావు, పద్మ, పద్మారాణి, శ్రీనివాస్,మస్తాన్ బి, శంకర్రావు, కృష్ణ, మహేష్, నారాయణరావు, ఉద్దండుషరీఫ్, సోమయాచారి, రమేష్, రాములు, డాక్టర్ వెంకటేశ్వర్లు, అపర్ణ, సరిత, రవికిరణ్, వసంత లక్ష్మి తదితర మొత్తం 100 మందికి పైగా రెండు గంటల పాటు పాదయాత్ర నిర్వహించారు.

# "లింక్డ్ఇన్" పై యస్.బి.ఐ.టి. లో అవగాహనా సదస్సు



**ఖమ్మం బ్యూరో, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు వ్యక్తిగత ప్రొఫైల్ ను కలిగి ఉండాలని యస్.బి.ఐ.టి. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కళాశాలలో ఐలెర్న్ శిక్షణా సంస్థ వారిచే నిర్వహించిన అవగాహనా సదస్సులో సంస్థ సి.ఒ.ఒ. శ్రీరామ్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి లింక్డ్ ఇన్ పోర్ట్ ఫోలియో కలిగి ఉండాలని, పొందిన శిక్షణ సర్టిఫికెట్స్, చేసిన ప్రాజెక్ట్స్, సాధించిన ఇంటర్న్షిప్స్ వంటి వివరాలను అంతర్జాలంలో ఉంచాలని తద్వారా ఉద్యోగ సంస్థలకు తమ వివరాలు అందుబాటులో ఉండగలవని సూచించారు. లింక్డ్ఇన్, గిట్, గిట్ హబ్ వంటి సామాజిక మాధ్యమాలు విద్యార్థులు తప్పక కలిగి ఉండాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. జి. ధాత్రి తెలిపారు. విద్యార్థులకు అకౌంట్ తయారి, ఉద్యోగ, ఇంటర్న్షిప్ అన్వేషణలపై లింక్డ్ ఇన్ ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. మొదటి సంవత్సర విద్యార్థులందరితో ప్రొఫైల్ ఖాతాలు తెరిపించి వారి వ్యక్తిగత వివరాలను ఎలా నమోదు చేయాలో ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా అందించగలిగామని తెలిపారు. ఇంటర్నెట్ ద్వారా ప్రపంచం ఓ కుగ్రామం లా మారిందని, ఎక్కడినుంచైనా ఎవరి నైనా సులువుగా తెలుసుకోగలమని కళాశాల ప్రిన్సిపల్ డా. జి. రాజ్ కుమార్ తెలిపారు. ఉద్యోగ సంస్థలు అభ్యర్థులను ఎంపికచేసే విషయంలో అంతర్జాలంలో అందుబాటులో ఉంచిన వివరాలను గమనిస్తారని కనుక విద్యార్థులు తమ సర్టిఫికెట్స్, ఇంటర్న్షిప్, ప్రాజెక్ట్స్ ఎప్పటికపుడు ఇంటర్నెట్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐలెర్న్ సంస్థ సి.ఒ.ఒ. శ్రీరామ్, హెచ్. ఆర్. మేనేజర్ జె. రేణురామన్, బి.డి.యమ్. యస్.కె. మన్సూర్, కళాశాల ఇన్నోవేషన్ సెల్ హెడ్ డా. మురళిమోహన్, కోఆర్డినేటర్ పి. అశ్విని, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా.ఎ.వి.వి. శివ ప్రసాద్, డా. జె. రవీంద్రబాబు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూత

## పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందదనీయం



**ఖమ్మం టౌన్, 13 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లాలో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూత నందిస్తున్న పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలను వ్యవసాయశాఖ విశ్రాంత ఏడి పి కోటేశ్వరరావు, కూసుమంచి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావు ప్రశంసించారు. శనివారం కృషిభవన్ లో జరిగిన కార్యక్రమంలో కేరళ సెంట్రల్ యూనివర్సిటీ లో చదువుతున్న వైరా కు చెందిన నిరుపేద విద్యార్థి బసవోజు మనోజ్ కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూతగా సమకూర్చిన ఇరవై వేల రూపాయల చెక్కు ను కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు అందజేశారు. ఖమ్మం వైఎస్ ఆర్ కాలనీకి చెందిన నిరుపేద విద్యార్థి తాటికొండ సోమశేఖర్ కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూతగా సమకూర్చిన ఇరవై వేల రూపాయల చెక్కు ను వ్యవసాయశాఖ విశ్రాంత ఏడి పుట్టగుంట కోటేశ్వరరావు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ విద్యలో మంచి ఫలితాలు సాదించి ఉన్నత స్థాయికి ఎదగాలని ట్రస్ట్ ఛైర్మన్ పరిశపుల్లయ్య, సభ్యులు మహంకాళి స్వరాజ్యలక్ష్మి, పరిశ లక్ష్మీరాజ్యం విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఎస్జిపిఏటి కోశాధికారి గుర్రాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఊడుగు వెంకటేశ్వరరావు, సీనియర్ పెన్షనర్లు సత్యనారాయణరావు, సుబ్బారావు, నారాయణరావు, పుల్లయ్య, నాగేశ్వరావు, మురళీకృష్ణ, మధుబాబు, ఉమాసుందరి తదితరులు పాల్గొన్నారు.